
సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 8 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం:సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన పుల్లెపు వీరన్న కాపు బుధవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.



డెల్టాలకు 5,650 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 150, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.0°/29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	30.0
కాకినాడ	40.8	29.7
అమలాపురం	43.0	29.0

న్యూస్‌రీల్

సీఎం కప్ పోటీలకు బాడీ బిల్డింగ్‌నూ అనుమతించాలి

అమలాపురం టౌన్: మలికిపురం మండల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్నాయుడు రెండు అంశాలపై బుధవారం వినతి పత్రాలు అందించారు. రాష్ట్రంలో జరుగుతున్న సీఎం కప్ క్రీడలకు బాడీ బిల్డింగ్ క్రీడను అనుమతించాలని కోరారు. 1998 డీఎస్సీకి చెంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారి ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు వర్తించేలా చేయాలని వినతి ప్రతంలో అభ్యర్థించారు.

ప్రైవేటు స్కూళ్ల తీరుతెన్నులపై సదస్సు రేపు

అమలాపురం టౌన్: విద్యా హక్కు చట్టం-ప్రైవేటు స్కూళ్లలో అమలు అవుతున్న తీరుతెన్నులపై కోనసీమ జిల్లా వినియోగదారుల సమాఖ్య (కోకో ఫెడ్), జిల్లా విద్యాశాఖ, సివిల్ సప్లయిస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని జిల్లా ప్రభుత్వ శాఖల భవనాల సముదాయం (ఎయిమ్స్ కళాశాల)లో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఈవో కమలకుమారి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి పాపారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించమే ధ్యేయంగా ఈ సదస్సు ఏర్పాట్లు చేసినట్లు కోకో ఫెడ్ కార్యదర్శి ఎస్.ఆదిత్య కిరణ్ తెలిపారు.

ఆరేళ్ల కిందటి కేసు కొట్టివేత



న్యాయవాది రాధాకృష్ణకు కృతజ్ఞతలు చెబుతున్న సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో కేఎఫ్‌డబ్ల్యూ కాలనీని ఆనుకుని మద్య దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ 2017లో ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిపిన పోరాటాల్లో 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరేళ్లుగా అమలాపురం కోర్టులో ఈ కేసు విచారణల కోసం ఆ సంఘాలకు చెందిన నిందితులు తిరుగుతూనే ఉన్నారు. కోర్టు తుది విచారణలో ఈ కేసును బుధవారం కొట్టివేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపి హర్షం వ్యక్తం చేశారు. అప్పట్లో జనావాసాలకు చేరువులో మద్యం దుకాణం వద్దని మూడు నెలల పాటు పోరాటాలు చేస్తే పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కేసును ఉచితంగా వాదించిన అమలాపురానికి చెందిన న్యాయవాది పినిపే రాధాకృష్ణను ప్రజా సంఘాల నాయకులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

మండు వేసవిలో వరగండ్ల వాన

- పాదయాత్ర మాట నిలబెట్టుకున్నారు
- వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు తీపి కబురు
- కాంట్రాక్ట్ సిబ్బంది కుటుంబాల్లో వెలుగులు
- ఉమ్మడి తూర్పులో ఐదారువేల మందికి ప్రయోజనం

సాక్షిప్రతినిధి, కాకినాడ: మండు వేసవిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు చల్లని కబురు అందించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలుచేసి చూపించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విపక్ష నేతగా పాదయాత్ర చేసిన సందర్భంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ మైదానంతో సహా పలు ప్రాంతాల్లో జగన్‌కు వివిధ ఉద్యోగ వర్గాలు తమ కష్టాలను వివరించాయి. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సహా పలు సమస్యలపై మొరబెట్టుకున్నాయి. వాటికి సీఎం బుధవారం మంత్రివర్గ సమావేశంలో పరిష్కారం చూపించారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

పన్నెండేళ్ల నిరీక్షణ ఫలించింది

తాజాగా కాంట్రాక్టు ఉద్యోగుల పక్షాన ప్రభుత్వం బుధవారం సానుకూల నిర్ణయం తీసుకుంది. 2014 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వీరిని క్రమబద్ధీకరించనుంది. మంత్రివర్గ నిర్ణయంతో ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులందరికీ 101 అకౌంట్ ద్వారా ప్రభుత్వమే వేతనాలు అందించనుంది. ఇన్నాళ్లూ పేరుకు ప్రభుత్వ ఉద్యోగులే అయినా వీరికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదు. రాజమహేంద్రవరం వైద్య విధాన పరిషత్ పరిధిలో సుమారు మూడువేల మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్లతరబడి గంపెడాశతో రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు హయాంలో మాట ఇచ్చి నిలువునా మోసం చేశారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మాటకు కట్టుబడ్డారు. పుష్కర కాల నిరీక్షణకు తెరదించి కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. తాజా నిర్ణయం ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదారువేల మంది సర్వీసు రెగ్యులైజ్ అవుతుందని ప్రాథమిక అంచనా. కాకినాడ జిల్లాలోనే 1,500 మంది వరకు ఉంటారని చెబుతున్నారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుతో ఆనందం

కొత్త జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులకు కూడా ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చింది. హెచ్‌ఆర్‌ఏ విషయంలో అన్యాయం జరుగుతోందని వీరంతా ఇన్నాళ్లూ ఆందోళన చెందుతున్నారు. వారి ఆవేదనను ప్రభుత్వం సానుకూలంగా ఆలకించింది. ఇంతవరకు ఇస్తున్న ఇంటి అద్దె భత్యం(హెచ్‌ఆర్‌ఏ) 16 శాతం చెల్లించేందుకు ఆమోదించింది. ఈ నిర్ణయం సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీల్లో నాన్‌టీచింగ్ సిబ్బంది, సొసైటీలలో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 సంవత్సరాలకు పెంచడం వల్ల వందలాది మందికి మేలు చేకూరుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేశారని ఈ వర్గాలు సంబరాలు చేసుకుంటున్నాయి. 11వ పీఆర్‌సీ బకాయిలు దశలవారీగా విడుదల, 12వ పీఆర్‌సీ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం లాంటి నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



కాకినాడ ఏపీఎన్‌జీఓ హోంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఏపీ ఎన్‌జీఓ ప్రతినిధులు

క్రమబద్ధీకరణ అభినందనీయం



2014 జూన్ 2 నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ మంత్రి వర్గ సమావేశం నిర్ణయించడం అభినందనీయం. కాంట్రాక్టు ఉద్యోగులతోపాటు రెగ్యులర్ ఉద్యోగులకు కూడా ముఖ్యమంత్రి జగన్ వరాలు ఇచ్చారు. 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయడం శుభపరిణామం. 11వ పీఆర్‌సీ బకాయిలను 2024లో 10 శాతం, 2025లో 20 శాతం, 2026లో 30 శాతం, 2027లో 40 శాతం దశల వారీగా చెల్లిస్తామనడాన్ని స్వాగతిస్తున్నాం. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు నుంచి జీతాల చెల్లింపును స్వాగతిస్తున్నాం. కొత్త జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ను నిర్ణయించడం సంతోషకరం.

– గుద్దటి రామ్మోహనరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్‌జీవోల అసోసియేషన్ అధ్యక్షుడు, కాకినాడ

ఆది నుంచీ సానుకూలత



వైఎస్ జగన్ కేబినెట్ సమావేశంలో ఉద్యోగుల పట్ల సానుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర రెవెన్యూసర్వీసెస్ తరపున కృతజ్ఞతలు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయడం, 11వ పీఆర్‌సీ బకాయిలు దశలవారీ చెల్లింపునకు అంగీకారం, కొత్తగా ఏర్పడ్డ జిల్లాల్లో పనిచేసే ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్ ఇవ్వడం వంటి నిర్ణయాలపై రాష్ట్ర ఉద్యోగుల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. తొలి నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరిస్తున్నారు. దశలవారీగా వారి డిమాండ్లను నెరవేర్చుకుంటూ వచ్చారు.

– వి.ఎస్.దివాకర్, చైర్మన్, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ, అమలాపురం,

ఉద్యోగుల ప్రయోజనాల పట్ల సీఎం నిర్ణయం అభినందనీయం



ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, జిల్లా కేంద్రాల్లో హెచ్‌ఆర్‌ఏ 16 శాతం పెంపు, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించేందుకు ఆమోదించడం వల్ల ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. కేబినెట్ నిర్ణయం పట్ల ప్రతీ ఉద్యోగి సంతృప్తికరంగా ఉన్నారు. ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవకు ఎన్జీవో సంఘం కృతజ్ఞతలు తెలుపుతోంది.

– పసుపులేటి శ్రీనివానివాస్, రాష్ట్ర ఎన్‌జీవోల సంఘం ఉపాధ్యక్షులు, కాకినాడ.

సీఎం నిర్ణయం ఓ వరం



పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కొత్త జిల్లాల్లో హెచ్‌ఆర్‌ఏ పెంపునకు కృతజ్ఞతలు. ఉద్యోగులకు తాజాగా సీఎం జగన్ ప్రభుత్వ ప్రకటన ఓ వరం లాంటిది. సీఎం ప్రకటించిన నిర్ణయాల పట్ల ప్రతి ఉద్యోగి అభినందనలు తెలుపుతున్నారు.

– పేపకాయల వెంకట కృష్ణ, ఏపీ ఎన్‌జీవో ఉమ్మడి జిల్లా కార్యదర్శి

నిరీక్షణ ఫలించింది



22 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాం. ఎట్టకేలకు నిరీక్షణ జగనన్న ద్వారా ఫలించింది. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి కాంటాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. ఈ మేలుకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆప్తమాలిక్ ఆఫీసర్స్‌కు మేలు జరుగుతోంది. విద్యాశాఖలో కూడా పలు కేటగిరీల్లోని 500 మంది ఉద్యోగుల కుటుంబాలకు మేలు జరుగుతోంది.

– యడ్ల రాజేష్, ఏపీ కాంట్రాక్ట్ ఫార్మసిస్టు అండ్ ఎల్టీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

010 పద్దు నుంచి జీతాలివ్వడం సంతోషం



1986 నుంచి వైద్యులు, స్టాఫ్‌నర్సులు, హెడ్ నర్సులు తదితరులు సుమారు జిల్లాలో 12వేల మంది ఉన్నారు. వీరందరూ జీతాల తీసుకొనే విషయంలో ఇబ్బందులు పడేవారు. ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ఇక నుంచి 010 పద్దు నుంచి జీతాలు ఇవ్వడం మంచి పరిణామం. కొత్తగా ఏర్పడ్డ జిల్లాలకు 16 శాతం హెచ్‌ఆర్‌ను నిర్ణయించడం అభినందనీయం.

– వైవీవీ సుబ్బారావునాయుడు, సీనియర్ అసిస్టెంట్, డీసీహెచ్‌ఎస్, కార్యాలయం

పేదరోగికి పెన్నిధి.. సీఎం సహాయ నిధి

- కాలేయ మార్పిడికి రూ.22 లక్షల మంజూరు
- చొరవ తీసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.12 లక్షల సాయం అనుమతి పత్రాన్ని నిడదవోలులో రోగి సుధాకర్‌కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేద రోగి వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22 లక్షలు సాయం చేసి అండగా నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలికి చెందిన కంకిపాటి సుధాకర్ తీవ్ర జీర్ణ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతనికి కాలేయ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుంది. అంత మొత్తాన్ని భరించే ఆర్థిక స్తోమత సుధాకర్ కుటుంబానికి లేదు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుల సహకారంతో నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిని కొంతకాలం క్రితం సుధాకర్ కలిశాడు. తన ఆరోగ్య పరిస్థితిని వివరించాడు. వైద్యానికి సాయం చేయాల్సిందిగా అర్థించాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధుల మంజూరుకు ఎమ్మెల్యే అవసరమైన పత్రాలు తయారు చేయించి ముఖ్యమంత్రి పేషీకి పంపేలా శ్రద్ధ తీసుకున్నారు. సుధాకర్ లివర్ మార్పిడికి ఈ ఏడాది మార్చి 29న రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో సుధాకర్ మంగళగిరిలోని మణిపాల్ ఆసుపత్రిలో చేరారు. అక్కడి శస్త్ర చికిత్సకు మరో రూ.12 లక్షలు ఖర్చవుతుందని స్పష్టం చేయడంతో వైద్యానికి కొంత అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు స్పందించి గత నెల 24న కొవ్వూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా కలసి, రోగి సుధాకర్ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. సీఎం జగన్ వెంటనే మరో రూ.12 లక్షలు మంజూరు చేశారు. మంజూరు పత్రాలు రావడంతో వాటిని రోగి సుధాకర్‌కు నిడదవోలులో బుధవారం ఎమ్మెల్యే అందించారు. ఆ పత్రాలు అందుకున్న సుధాకర్ కళ్లు చెమర్చాయి. తన లాంటి పేద వాడి వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు దఫాలుగా రూ.22 లక్షలు విడుదల చేసిందంటే నోట మాట రావడం లేదన్నాడు. ముగిసిపోతుందనుకున్న తన జీవితానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోశారంటూ వారిద్దరికీ, సహకరించిన వైఎస్సార్ సీపీ పెరవలి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం తగదు


ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం కావాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదేశించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం ఆయన నిశితంగా పరిశీలించారు. తొలుత వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎఫ్‌టీబీ వర్క్ సైట్‌ను, తర్వాత మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల పురోభివృద్ధిని సమీక్షించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌తో ఎంపీ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం కనిపించాల్సి ఉందన్నారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్ ఇచ్చిన వివరణతో ఎంపీ సంతృప్తి చెందలేదు. బ్రిడ్జి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను కూడా పరిశీలించారు. సర్వీస్ రోడ్డు 1.5 కి.మీ.కు గాను బ్యాలెన్స్ 650 మీటర్స్ ఉందని కాంట్రాక్టర్ తెలిపారు. మూడు కల్వర్టులకు గాను 60–70 శాతం పనులు ఉన్నాయన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రతివారం పనుల పురోగతి కనిపించాలన్నారు. ఇకపై వారం వారం తప్పనిసరిగా ఈ పనులపై సమీక్షిస్తానన్నారు. పిల్లర్ల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. పిల్లర్లు 18 మీటర్ల కిందకు అంటే 60 అడుగుల లోతు వరకూ నిర్మాణ పనులు పూర్తయ్యాయని కాంట్రాక్టర్ సురేష్ గౌడ్ వివరించారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తవుతాయన్నారు. గడ్డర్లు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఎంపీ వెంట నేషనల్ హైవే మేనేజర్ సాల్మన్ అన్సారీ, సైట్ ఇంజినీర్ సాయినాథ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, కడలి వెంకటేశ్వరరావు, రేలంగి వీర వెంకట సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

సూక్ష్మ సేద్యం.. లాభాలు సాధ్యం



- బిందు, తుంపర పరికరాలతో లాభసాటి వ్యవసాయం
- 3,000 హెక్టార్లలో సాగు లక్ష్యాలను నిర్దేశించుకున్న అధికారులు
- రైతుల పొలాన్ని బట్టి 90 నుంచి 50 శాతం సబ్సిడీ
- ఆ పరికరాల అందజేతకు సన్నాహాలు

సాక్షి, రాజమహేంద్రవరం: పంట సాగులో నీటి ఎద్దడిని సూక్ష్మ సేద్యం ద్వారా అరికట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా బిందు, తుంపర సేద్య పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్) రైతులకు అందజేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. బహిరంగ విపణిలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకుండా.. ఆర్బీకేల ద్వారా నామ మాత్రపు రుసుము చెల్లిస్తే చాలు.. సబ్సిడీపై సరఫరా చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆర్బీకేల్లో ప్రారంభమైంది. మైక్రో ఇరిగేషన్ అధికారులు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

2023–24 లక్ష్యాలు ఇలా..

జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. వరితో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. సింహభాగం పంటలకు సాగునీటి వసతి ఉన్నా.. మెట్ట ప్రాంతంలో కొంచెం నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిందు, తుంపర సేద్య పరికరాల అవసరం ఉంది. అందుకే ఈ ఏడాది మూడు వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించాలని మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.17 కోట్లతో పరికరాలు అందజేసేందుకు సమాయత్తమవుతున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మైక్రో ఇరిగేషన్ కంపెనీలు పరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను 367 రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన మైక్రో ఇరిగేషన్ విభాగం అధికారులు అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి సర్వే చేస్తారు. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే 2,193 మంది రైతులు 2,846 హెక్టార్లకు పరికరాలు కావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



బిందు సేద్య పరికరాలు అమర్చిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గతేడాది లక్ష్యానికి మించి..

గతేడాది సూక్ష్మ సేద్యం ద్వారా 2వేల హెక్టార్లు సాగు చేయాలని నిర్దేశించుకోగా.. అంతకు మించి 2,941 హెక్టార్లలో సాగు చేసి 147.05 శాతం లక్ష్యాన్ని సాధించారు. 47 శాతం అదనంగా సాగు చేపట్టడం విశేషం. గత మూడేళ్లలో పథకానికి రూ.45 కోట్ల మేర వెచ్చించింది. 15,157 మంది రైతులకు సంబంధించి 21,030 హెక్టార్లు పథకంలో సాగు సదుపాయం, పరికరాలు అందజేసింది.

ఐదెకరాల్లోపు 90 శాతం రాయితీ

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఐదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు గరిష్ఠం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింప చేస్తారు. తుంపర సేద్యానికి ఎకరం నుంచి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాలపైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్ కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు. బిందు సేద్య పరికాలు ఉద్యాన పంటలకు ఇస్తారు.

అపరాలకు స్పింకర్లు

అపరాలు, గడ్డి పండించేకునే రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం, ఆపై 45 శాతం సబ్సిడీతో అందజేయనున్నారు.

రైతులు ఏం చేయాలంటే..

బిందు, తుంపర సేద్య పరికరాలు పొందాలనుకున్న రైతులు ఆధార్ కార్డు, మీ భూమి వన్‌బీ, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్ కాపీలు ఆర్బీకేల్లో ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి అర్హత ఉంటే మంజూరు చేస్తారు. రైతులకు విద్యుత్ సదుపాయం, బోరు తప్పనిసరిగా ఉండాలి.

డ్రిప్ ఉపయోగాలు..

- పంటను బట్టి 30–70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అందుతుంది. పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువుల సరఫరా చేస్తుండటంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏకకాలంలో పంట కోతకు వస్తుంది.
- 40 శాతం విద్యుత్ ఖర్చు ఆదా అవుతుంది. కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడ పీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తుపల్లాలు ఉన్న నేలలో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20నుంచి 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా...

మండలం	రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు	విస్తీర్ణం (హెక్టార్లలో)
కొవ్వూరు	26	32.08
చాగల్లు	165	209.20
తాళ్లపూడి	85	122.27
నిడదవోలు	39	36.76
ఉండ్రాజవరం	6	10.04
పెరవలి	31	31.63
దేవరపల్లి	331	499.51
గోపాలపురం	411	573.87
నల్లజెర్ల	530	690.23
సీతానగరం	27	35.15
కోరుకొండ	120	110.67
గోకవరం	50	64.22
రంగంపేట	192	206.47
రాజానగరం	86	109.12
రాజమండ్రి రూరల్	22	16.74
కడియం	12	13.82
అనపర్తి	6	7.72
బిక్కవోలు	54	76.78

సూక్ష్మ సేద్యంతో సత్ఫలితాలు



చిన్న, సన్నకారు రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. తక్కువ నీటితో పంటను పండించుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రభుత్వం వారి విస్తీర్ణాన్ని బట్టి 90, 50 శాతం సబ్సిడీపై అందజేస్తోంది. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గతేడాది సాగులో గణనీయమైన లాభాలు పొందారు. జిల్లాలో ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. 2,193 మందికి సంబంధించి 2,846 హెక్టార్లు రిజిస్ట్రేషన్ చేపట్టాం. మిగిలిన వారు సైతం రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. పథకాన్ని రైతులు సత్వరమే ఉపయోగించుకోవాలి.

– కె.స్వాతి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

క్లుప్తంగా

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


మృతుడు సత్యనారాయణ (ఫైల్)

రంగంపేట: వడదెబ్బకు ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో బుధవారం జరిగింది. దీనిపై ఉపాధి హామీ ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడిశలేరుకు చెందిన బొల్లా సత్యనారాయణ (50) ఉపాధి కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం స్థానిక తిమ్మరాజు చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనుల్లో తోటి కూలీలందరితో పాటు సత్యనారాయణ పని చేస్తుండగా ఎండ వేడికి తాళలేక స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతన్ని చెట్టునీడకు తరలించి ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ప్రభుత్వ పరంగా అందించే రూ.50 వేల నగదు త్వరలోనే మృతుని కుటుంబ సభ్యులకు అందించేందుకు కృషి చేస్తామని ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నూకల నారాయణరత్నం

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు నూకల నారాయణరత్నం (107) బుధవారం మృతి చెందారు. ఈమె భర్త నూకల సుబ్బారాయుడు 1997వ సంవత్సరంలో వృద్ధాప్యంతో మరణించారు. అప్పటికి ఆయన వయసు 90 ఏళ్లు. వీరికి ఎనిమిది మంది సంతానం. వారిలో నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరిలో ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు మరణించారు. వారికి పుట్టిన సంతానంలో మనమలు, మనమరాండ్లు 15 మంది ఉండగా 13 మంది మునిమనమలు, నలుగురు అను మనవలు ఉన్నారు. నారాయణరత్నం మృతి పట్ల గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.


జనానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


థాంక్యూ సీఎం సార్.. అంటూ ప్లకార్డులు చూపుతున్న జనం

● ప్రభంజనం

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొద్దిసేపు పర్యటించగా జనం బ్రహ్మరథం పట్టారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తనయుడు వెంకటరామ్ వివాహానికి మలికిపురం మండలం కత్తిమండ వచ్చిన ఆయనను చూడడానికి, తమకు జరిగిన మేలుకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి జనం ప్రాధాన్యమిచ్చారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు చేతపట్టుకొని దారి పొడవునా ఆయనకు స్వాగతం పలికారు.


చేతులూపుతూ.. సెల్ఫీలు తీస్తూ..


జగనన్నను చూసిన ఆనందంలో..

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు


ఎన్.సతీష్‌రెడ్డి, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అటానమస్(స్వయం ప్రతిపత్తి) హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. తమ కళాశాలకు మార్చి 2016 నుంచి 2 ఎఫ్, జూన్ 2018 నుంచి 12(బి) హోదాలు ఉండగా, గత ఏడాది ఎన్‌బీఏ బృందం న్యాక్ ఏప్లస్ గుర్తింపు కల్పించగా తాజాగా ఈ ఏడాది అటానమస్ హోదా కలిగిందన్నారు. ఉన్నత విద్యా ప్రమాణాలు పాటించడంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న తమ కళాశాలకు ఈ హోదా రావడంపై కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డోలా సంజయ్ అభినందనలు తెలిపారు.

ఉత్కంఠగా కోనసీమ జిల్లా అండర్ - 19 చెస్ పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ క్లబ్‌లో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు చెస్ పోటీలు ఉత్కంఠగా ఆరు రౌండ్లలో జరిగినట్లు కోనసీమ చెస్ కన్వీనర్ తాడి వెంకట సురేష్ తెలిపారు. ఈ పోటీలను ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోడెల శంకరరావు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన చెస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గతంలో అనేకమార్లు రాష్ట్ర చాంపియన్‌గా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ద్రాక్షారపు సాత్విక్ చాంపియన్‌గా నిలిచాడు. బాలికల విభాగంలో గత జిల్లా చాంపియన్ పనిశెట్టి ధరణి మళ్లీ చాంపియన్‌గా నిలిచింది. బాలుర విభాగంలో చింతపల్లి సూర్య ద్వితీయ స్థానం, గిరిమణి శేఖర్ తృతీయ స్థానం, తోలేటి శ్రీకాంత్ నాల్గవ స్థానం సాధించగా బాలికలలో గుత్తుల వైష్ణవి ద్వితీయ స్థానం, గెద్దాడ అక్షయ తృతీయ స్థానం, నూకపెయ్యి హన్విక నాల్గవ స్థానం సాధించారు. వీరు నంద్యాల, విజయవాడలలో జరగనున్న రాష్ట్ర చాంపియన్ షిప్‌లకు ఎంపికయ్యారు. విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్ వర్మ, ప్రతినిధి సూర్యతేజ బహుమతులు అందజేశారు.

నన్నయ పీజీ సెంటర్ ప్రాంగణంలో మంటలు

- వలంటీర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం
- నాలుగు అగ్నిమాపక శకటాలతో ఆర్పివేత


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటరు ప్రాంగణంలో మంటలు చెలరేగాయి. పీజీ సెంటరు వద్ద బాయ్స్ హాస్టల్ వెనుక దట్టమైన మొక్కలు, తాటి చెట్లకు మంటలు అంటుకున్నాయి. ఆ మంటలు కొద్ది సేపటికే పీజీ సెంటరు వెనక్కు వ్యాపించాయి. సమీపంలోని వారికి దట్టమైన పొగతో మంటల కనిపిస్తుండడంతో తిమ్మాపురం వలంటీర్ కోడి నాగరాజు గుర్తించి సాలిపేట అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వారు రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాకపోవడంతో పీజీ సెంటరు ప్రిన్సిపాల్ డాక్టరు కమలకుమారి స్పందించి కాకినాడలోని కోరమాండల్, ఎన్ఎఫ్‌సీఎల్ సహకారం కోరారు. వెంటనే రెండు కర్మాగారాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలు ఆర్పి వేశాయి. ప్రిన్సిపాల్ కమలకుమారి మాట్లాడుతూ మంటలకు కారణం తెలియలేదని, అయితే క్యాంపస్ వెనక మామిడితోట సమీపంలో ఇళ్లు ఉండడంతో ఆందోళనకు గురయ్యామన్నారు.

భక్తులకు అందుబాటులో 'సచిత్ర అన్నవరం క్షేత్ర చరిత్ర'


'సచిత్ర అన్నవరం క్షేత్ర చరిత్ర 'పుస్తకం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆవిర్భావం, వ్రత కథ, స్వామివారి నిత్య కల్యాణం, దేవస్థానంలో చూడతగిన విశేషాలు, వసతి వివరాలు, విరాళాల సమాచారంతో కూడిన 'సచిత్ర అన్నవరం క్షేత్ర దర్శిని' పుస్తకం భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ పుస్తకాన్ని రత్నగిరిపై రామాలయం వద్ద గల పీఆర్వో కార్యాలయంలో బుధవారం నుంచి విక్రయిస్తున్నారు. స్వల్ప లాభంతో రూ.వంద కే ఈ పుస్తకాన్ని విక్రయిస్తున్నట్లు ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. 60 పేజీల ఈ పుస్తకాన్ని గత నెల ఒకటో తేదీన ఉపముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. దేవస్థానం ఆ స్థాన వేదపండితుడు గొల్లపల్లి వేంకట్రామ సుబ్రహ్మణ్య ఘనాపాఠీ సహకారంతో భద్రాచల దేవస్థానం ఆస్థాన వేదపారాయణ దారుడు ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు ఈ పుస్తకాన్ని రచించారు. విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు నీలి వేంకటరమణ ఈ పుస్తకంలో చిత్రాలు వేశారు.

పీఆర్వో కార్యాలయం వద్ద సచిత్ర పుస్తక విక్రయాలు

రత్నగిరిపై రామాలయం ఎదురుగా గల పీఆర్వో కార్యాలయం వద్ద అన్నవరం క్షేత్ర చరిత్ర పుస్తకాలను విక్రయిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

రైలు ప్రయాణికుడిని కాపాడిన సిబ్బంది


ప్రయాణికునికి ప్రాథమిక చికిత్స చేసిన సిబ్బంది

సామర్లకోట: గుర్తు తెలియని రైలు నుంచి మంగళవారం జారి పడిపోయిన ప్రయాణికుడిని రైల్వే అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించి రక్షించిన ఘటన ఇది. సామర్లకోట సౌత్ రైల్వే కేబిన్ దాటిన తరువాత వీపు, తలకు గాయాలతో పట్టాలపై పడి ఉన్న ప్రయాణికుడిని అక్కడ పనిచేస్తున్న సిగ్నల్ సిబ్బంది గమనించారు. విషయాన్ని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు తెలిపారు. క్షతగాత్రుడిని ట్రాలీపై రైల్వే స్టేషన్‌కు తీసుకొని వచ్చి రైల్వే ఆస్పత్రి సిబ్బంది ద్వారా ప్రాథమిక చికిత్స చేయించి 108లో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు ప్రమాదం నుంచి బయట పడ్డాడని స్టేషన్ మేనేజరు రమేష్ తెలిపారు. అయితే గాయపడిన వ్యక్తి వివరాలు తెలియలేదన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

8 కాసుల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం

చాగల్లు: మండలంలో మల్లవరంలో ఇటీవల ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీన పరుచుకున్నట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్లవరానికి చెందిన లకంసాని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి తన మేనకోడలు నిశ్చితార్థం కార్యక్రమానికి గత నెల 13వ తేదీన పాలకొల్లు వెళ్లారు. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉండటాన్ని గమనించి బంధువులు సమాచారం ఇచ్చారు. ఈ నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చి చూడగా బెడ్‌రూమ్‌లో పరుపులు, బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన ఎనిమిది కాసుల బంగారు, సుమారు ఒక కిలో వెండి వస్తువులు కనిపించకపోవడంతో శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసులో నిందితులైన ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన నార్గాని గోపాలకృష్ణ, అంగర అంజిబాబులను బుధవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8 కాసుల బంగారు వస్తువులు, 950 గ్రాముల వెండి వస్తువులను స్వాధీన పరుచుకున్నట్టు ఎస్సై తెలిపారు. ఇంటికి తాళం వేసివున్నట్టు గుర్తించి పగటి పూట రెక్కీ నిర్వహించి అదే రోజు రాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడ్డారని అన్నారు. తాళాలు వేసిన ఇళ్లే నిందితులకు టార్గెట్ అని ఈ కేసు విచారణలో తెలిసిందని తెలిపారు. ఇంటికి తాళం వేసే సందర్భం వచ్చినప్పుడు తాళాలు బయటి వ్యక్తులకు కనపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రమేష్ తెలిపారు.

సాగోగులు తెలుసుకుందామని..

వ్యవసాయం బాట పట్టిన జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్


వరి విత్తనాలు చల్లుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సాగులో రైతులు పడే ఇబ్బందులను స్వయంగా చూసి పరిష్కరించేందుకుగాను స్వయంగా సాగు చేపట్టానని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ అన్నారు. బుధవారం రాజవోలు గ్రామంలో ఆయన 3.43 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగుకు ఉపక్రమించారు. పొలంలో 1318 వరి రకం విత్తనాలు జల్లి నారుమడి వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ మాట్లాడుతూ రైతులు సాగులో అవలంబిస్తున్న పద్ధతులను స్వయంగా చూసి ధాన్యం అమ్ముకునేటప్పుడు ఏవిధంగా రైతుకు ప్రయోజనం కలుగుతుందనే విషయాలను పరిశీలించేందుకు తాను హలం పట్టానని తెలిపారు. జిల్లాలో రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా సాగులో ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటానన్నారు. వ్యవసాయశాఖ సహకారంతో సాగు చేస్తానన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సహాయ సంచాలకులు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ స్వర్ణ, 1064 క్రాసింగ్ విత్తనమైన 1318 వరిరకాన్ని పొలంలో వేశామన్నారు. ఈ విత్తనం 13రోజులు పంట మునిగినా తట్టుకుంటుందన్నారు. స్వర్ణ మాదిరిగానే దుబ్బు బాగా వస్తుందని, నల్లగా ఉంటుందని, గింజ ఎర్రగాను, స్వర్ణ ధాన్యం నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఆకుఎండు తెగులును తట్టుకుంటుందని, పడిపోదని, దోమను తట్టుకుందని తెలిపారు. తుపానులు వచ్చినా, ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ఈ వరి రకం తట్టుకుంటుందని స్పష్టం చేశారు. దిగుబడి ఎకరాకు 45నుంచి 50బస్తాల వరకు వస్తుందన్నారు. ఈ వరి రకాన్ని కడియం, తొర్రేడు ఆవ ప్రాంతాల్లో రైతులు సైతం వేయనున్నారని వారు తెలిపారు. వీఏఏలు దుర్గబాబు, పుష్ప, ప్రసన్న, రైతు మార్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభ్యాసానికి మెరుగులు

- విస్తృతంగా 'జన్ భాగిధారి'
- షెడ్యూల్ విడుదల చేసిన సమగ్ర శిక్షా
- ఈ నెల 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు


రాయవరం మండలం కృష్ణమ్మ చెరువు పాఠశాలలో విద్యార్థులతో నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు విద్యాశాఖ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సాల్ట్, తర్ల్, లెర్న్ ఏ వర్డ్ ఏ డే తదితర కార్యక్రమాలను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో భాష, సంఖ్యా శాస్త్రంలో ప్రాథమిక భావనలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా 'జన్ భాగిధారి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. విద్యార్థుల్లో అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలు (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీ) అభివృద్ధి లక్ష్యంగా 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాల అమలుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది.

సమాజ భాగస్వామ్యం పెంచేందుకు

విద్యపై సమాజ భాగస్వామ్యాన్ని పెంచడం జన్ భాగిధారి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యపై ఆసక్తి ఉన్న వారిని ఇందులో భాగస్వాములను చేయాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజ భాగస్వామ్యంతో చేసే కార్యక్రమాలను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి గూగుల్ ట్రాకర్‌లోకి అప్లోడ్ చేయాలి.

అభ్యసన సామర్థ్యాల పెంపుదలే లక్ష్యం

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుదలే లక్ష్యంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేసిన బోధనోపకరణాలు (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ప్రదర్శించాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావంతులతో కలిసి ర్యాలీలు నిర్వహించాలి. విద్యార్థులతో కథలు చెప్పించడం, రంగోలి, టీఎల్ఎం ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. ఎఫ్ఎల్ఎన్‌పై ప్రభాతభేరి చేయడం, క్విజ్, పద్యాలు చదివించడం, వాల్ పెయింటింగ్ వంటి కార్యక్రమాలను చేపట్టాలి. తెలుగు, గణితంలో పునాది అభ్యసన, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం దీని ప్రధాన ఉద్దేశం. జాతీయ స్థాయిలో నిర్వహించిన నాస్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన శ్లాస్ సర్వేలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు ఆయా తరగతులకు అనుగుణంగా లేక పోవడాన్ని గుర్తించారు. 2026 నాటికి ఆయా తరగతులకు అనుగుణంగా అభ్యసన సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడం ఎఫ్ఎల్ఎన్ ప్రధాన ఉద్దేశం. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ ఉన్న వారిని మండల స్థాయికి పంపించాలి. మండల స్థాయిలో పోటీలు నిర్వహించి అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఈ నెల 15వ తేదీ లోగా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 19–21 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జాతీయ స్థాయిలో జీ20 ఎడ్యుగ్రూపు సదస్సు నిర్వహిస్తున్నారు.

> **షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలి**
>
> 
>
> జన్‌భాగిధారి' కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించాలి. ఇందుకు అవసరమైన ఆదేశాలను మండల విద్యాశాఖాధికారులకు జారీ చేశాం. పాఠశాల, మండల స్థాయిలో ఉపాధ్యాయులు పక్కాగా కార్యక్రమాన్ని నిర్వహించాలి. చేసిన కార్యక్రమాలకు సంబంధించి గూగుల్ ట్రాకర్‌లో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలి. నిపుణ్ భారత్ ప్రతిజ్ఞను విద్యార్థులతో చెప్పించాలి.
>
> – ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 'జన్‌భాగిధారి' కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో అందుబాటులో ఉన్న విద్యార్థులతో జన్‌భాగిధారి కార్యక్రమాలను చేపడుతున్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న 1,589 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ ఉపాధ్యాయులు జన్‌భాగిధారి కార్యక్రమాలను చేపడుతున్నారు.